## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మద్దిలపాలెం : ఈపీడీసీఎల్ జోన్–1 పరిధిలో ఈస్ట్ పాయింట్ కాలనీ సబ్ స్టేషన్ పరిధిలో పలు మరమ్మతులు చేపట్టనుండడంతో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–1 ఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ మెంటల్ ఆస్పత్రి, సాయిబాబా ఆలయం, ఈస్ట్ పాయింట్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

### ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంవీపీ ఎస్‌ఐ శ్రీనివాసరావు

మద్దిలపాలెం : విద్యలో రాణించి ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని ఎంవీపీ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ శ్రీనివాసరావు అన్నారు. యాంటీ డ్రగ్స్, ర్యాగింగ్‌పై మంగళవారం వీఎస్ కృష్ణా జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యార్థులు మెలగాలన్నారు. చెడు వ్యసనాలు జోలికి వెళ్లకుండా ఉత్తమ విద్యార్థులుగా గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేయడం, ఈవ్‌టీచింగ్ చేయడం వంటి కార్యక్రమాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమణి, ఎస్‌ఐ సల్మాన్ బేగ్, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాఖ విద్య: సంక్రాంతి పండుగ సెలవుల్లో తరగతులు నిర్వహించే పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎస్సీపిసిఆర్) సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్లు ఈ నెల 9 నుండి 18 వరకు,అలాగే ఇంటర్మీడియట్ కళాశాలలు 11 నుండి 17 వ తేదీ వరకు విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ఇవ్వాల్సిందేనన్నారు. ప్రభుత్వ ఆదేశాలు, కమిషన్ సూచనలు పాటించని స్కూళ్లు, కాలేజీల గుర్తింపు రద్దుతో పాటు క్రిమినల్ చర్యలకు సిఫార్సులు చేస్తామన్నారు.

### చెత్త తొలగింపు విషయంలో వివాదం

బీచ్ రోడ్డు: పారిశుధ్య కార్మికుల సమ్మె కారణంగా 21వ వార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న క్రమంలో వివాదం నెలకొంది. జీవీఎంసీ 21వ వార్డులో పేరుకుపోయి చెత్తను శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేష్ పొక్లెయిన్‌తో తొలగిస్తుండడంతో అక్కడికి చేరుకున్న పారిశుధ్య కార్మికులు అడ్డుపడ్డారు. చెత్తను తొలగించకుండా ఆపాలని ప్రయత్నించారు. రాజేష్‌తో కార్మికులు గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న ఎంవీపీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

### కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 27వ రోజు మంగళవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం , 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. 108 స్వర్ణపుష్పాలతో కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన జరిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో, త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



# వావ్.. సీ వ్యూ




- ఆకట్టుకుంటున్న వైఎస్సార్ సీ వ్యూ పాయింట్
- 2.40 కోట్లతో అభివృద్ధి
- నిత్యం సందర్శకులతో కళకళ..

ఆరిలోవ: తుప్పలు, ఊడిన పలకలతో ఎప్పుడూ కళావిహీనంగా దర్శనమిచ్చే సీతకొండ వ్యూ పాయింట్.. ప్రస్తుతం ఆధునికీకరణతో కనువిందు చేస్తోంది. వైఎస్సార్ సీ వ్యూ పాయింట్ పేరిట సుందరంగా తీర్చిదిద్దిన ఈ ప్రాంతం సందర్శకులను ఆకట్టుకుంటోంది. గతేడాది మార్చిలో నగరంలో జరిగిన జీ–20 సదస్సులో భాగంగా నగరంలో పలు ప్రాంతాలను జీవీఎంసీ అధికారులు రూ.కోట్లు నిధులు వెచ్చించి అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా అధికారులు ఆర్‌కే బీచ్ నుంచి సాగర్‌నగర్ మీదుగా రుషికొండ బీచ్ వరకు రోడ్డును అందంగా తీర్చిదిద్దారు. ఈ మధ్యలో ఉన్న విశాలాక్షినగర్, సమీపం సీతకొండ వద్ద బీచ్ రోడ్డును మరింత సుందరంగా తయారు చేశారు. సముద్రానికి కొంత ఎత్తులో ఉన్న ఈ సీ వ్యూ పాయింట్ ఎలాంటి సౌకర్యాలు లేకుండా, గోతులు, పలకలు ఊడిన పాత్‌వేలు, ముళ్ల తుప్పలతో అస్తవ్యస్తంగా ఉండేది. జీ–20 సదస్సు కారణంగా ఈ సీ వ్యూ పాయింట్‌కు మహర్దశ వచ్చింది.



రాత్రి వేళ విద్యుత్ కాంతులు




అభివృద్ధి చేసిన సీవ్యూ పాయింట్ (నేడు)

**రూ. 2.40 కోట్లతో వసతులు**

సీతకొండ వద్ద రూ.2.40 కోట్ల నిధులతో జీవీఎంసీ అభివృద్ధి చేసింది. ఇందులో భాగంగా ఇక్కడ రోడ్డును అద్దంలా మెరిసేటట్లు చేసింది. ఐ లవ్ వైజాగ్ బోర్డు, సోలార్ ట్రీ, సందర్శకులు కూర్చోవడానికి పొడవైన బెంచి మాదిరిగా సిమెంట్ గోడ, వెడల్పుగా పాత్‌వే, సందర్శకుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయం, పచ్చని మొక్కల మధ్య కొండ అంచున ఆకట్టుకొనే బొమ్మలతో కూడిన పెయింటింగ్స్, బీచ్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్, రాత్రి వేళ మిరమిట్లు గొలిపేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. పచ్చని మొక్కల మధ్య రంగు రంగుల విద్యుత్ కాంతులు సందర్శకులతో పాటు అటుగా వెళ్లే ప్రయాణికులకు కనువిందు చేస్తున్నాయి. దీంతో పాటు ఇక్కడ ఏర్పాటు చేసిన ఐ లవ్ వైజాగ్ బోర్డు మరింత ఆకర్షణగా నిలిచింది. ఇక్కడ సందర్శకులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకోవడానికి పోటీ పడుతున్నారు. ప్రస్తుతం ఈ సీ వ్యూ పాయింట్ నిత్యం సందర్శకులతో కళకళలాడుతోంది.




సీతకొండ బీచ్ వద్ద గతంలో ఊడిన పలకలు, తుప్పలతో అస్తవ్యస్తంగా ఉన్న పాత్‌వే (నాడు)



ఐ లవ్ వైజాగ్ బోర్డు వద్ద ఫొటోలు తీసుకుంటున్న సందర్శకులు



పాత్‌వే పక్కన ఏర్పాటు చేసిన సోలార్ ట్రీ



కొండ అంచున రాయిపై వేసిన పెయింటింగులు

# మళ్లీ సీఎంగా వైఎస్ జగనే కావాలి



పదో వార్డు ఎస్.ఐ.జి నగర్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ..

- అదే ప్రజల ఆకాంక్ష
- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ
- 10వ వార్డులో ఉత్సాహంగా పాదయాత్ర

ఆరిలోవ: ప్రజలు మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 10వ వార్డులో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా పాదయాత్ర ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలసి ఆయన వార్డులో 33వ సచివాలయం పరిధి ఎస్‌ఐజీ నగర్, బీఎస్ఆర్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో అమలు జరుగుతున్న పలు సంక్షేమ పథకాలకు సంబంధించిన పత్రాలు అందజేశారు. పథకాల వల్ల ఎలాంటి లబ్ధి చేకూరిందో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. వీధి దీపాలు వెలగకపోవడం, క్షీణించిన పారిశుధ్యం, తదితర సమస్యలు ప్రజలు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన ఎంవీవీ సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన మామీలన్నింటినీ నెరవేర్చారన్నారు. పాదయాత్ర ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, బీసీ విభాగం డైరెక్టర్ కె.ఆర్.పాత్రుడు, స్థానిక నాయకులు పతివాడ కనకరాజు, బొండా శ్రీనివాసరావు, మొల్లి హేమంత్, చలం, మొల్లి వెంకటరమణ, కె.ఆర్.వి.ప్రసాద్, చింతా శ్రీనివాస్, వరలక్ష్మి, గోవింద్, రామారావు, కృష్ణ, సచివాలయాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్ సచివాలయం పరిధిలో జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. 15, 16వ వార్డుల కార్పొరేటర్లు అప్పారి శ్రీవిద్య, మొల్లి లక్ష్మి చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇద్దరు కార్పొరేటర్లు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రమేష్‌నాయుడు, గౌతం, బంగారి, సునీత, జనార్దన్, వైఎస్సార్ సీపీ నాయకులు గొలగాని త్రినాథరావు, బుగత ఏసురత్నం పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న కార్పొరేటర్లు అప్పారి శ్రీవిద్య, మొల్లి లక్ష్మి

# సంక్రాంతి సెలవులు పట్టని ప్రైవేట్ పాఠశాలలు



పైనాపిల్‌కాలనీలో మంగళవారం తెరిచిన ఓ పాఠశాల



ఆరిలోవలో తెరిచి ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్

ఆరిలోవ: ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు విద్యాశాఖాధికారుల ఆదేశాలు బేఖాతర్ చేస్తున్నారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోకుండా మంగళవారం యథావిధిగా తెరిచారు. రాష్ట్రంలో విద్యాశాఖాధికారులు ఈ నెల 9 నుంచి 18 వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు కూడా ప్రకటన జారీ చేశారు. అయితే ఈ సెలవులను ఆరిలోవ ప్రాంతంలో పలు ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు పట్టించుకోలేదు. దర్జాగా మంగళవారం పాఠశాలలు తెరిచారు. స్కూల్ బస్సుల్లో కూడా పిల్లల్ని ఎక్కించి యథేచ్ఛగా నడిపారు. కొన్ని పాఠశాలలకు వారి సొంతంగా సెలవులు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. ఈ నెల 12 వరకు పాఠశాలలు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ నెల 13 నుంచి 17వ వరకు సెలవులు ఇవ్వాలని భావిస్తున్నట్టు సమాచారం. దీంతో ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సంక్రాంతి కోసం సొంత ఊళ్లు వెళ్లి రావడానికి ఈ సెలవులు సమస్యగా మారాయని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైనాపిల్ కాలనీలో వివేకానంద విద్యానికేతన్, పాత ఆరిలోవ, అంబేడ్కర్ నగర్‌లో సీతాంజలి స్కూల్ తమ బస్సులను సైతం నడిపి పాఠశాలలను నిర్వహించారు. చినగదిలి, పెదగదిలి, ఆదర్శనగర్, రవీంద్రనగర్, విశాలాక్షినగర్‌లలో కూడా పలు పాఠశాలలను తెరిచారు. ఇలాంటి పాఠశాలలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# 'ప్రజా సంకల్ప యాత్ర' చారిత్రాత్మకం



కేక్ కట్ చేస్తున్న అక్కరమాని తదితరులు



కేక్ కట్ చేస్తున్న ఎంపీ ఎంవీవీ, మొల్లి అప్పారావు, తదితరులు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర చారిత్రాత్మకమని ఆ పార్టీ నాయకురాలు అక్కరమాని విజయనిర్మల అన్నారు. ప్రజా సంకల్పయాత్ర పూర్తయి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఎంవీపీ కాలనీలోని తన కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ చారిత్రాత్మకమైన ప్రజా సంకల్పయాత్ర రాష్ట్రంలోని ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు సుదీర్ఘంగా కొనసాగిందన్నారు. ఈ యాత్ర ద్వారా ప్రజల కష్టాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక, సంక్షేమ, సామాజిక, రాజకీయ రంగాల్లో అగ్రతాంబూలం అందిస్తున్నారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**ఎంపీ ఎంవీవీ కార్యాలయంలో..**

ఎంవీపీ కాలనీ: ప్రజా సంకల్పయాత్రకు ఐదేళ్లు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణతో పాటు పార్టీ నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లాసన్స్ బే కాలనీలోని ఎంపీ ఎంవీవీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్ర రాష్ట్ర చరిత్ర సరికొత్త రికార్డు నెలకొల్పిందన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

# మురికివాడల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఏయూ క్యాంపస్: మురికివాడల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు పెంచాలని మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం(ఎంఎన్ఎస్ఎస్), ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు కోరారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖ నివాస హక్కుల పోరాట దినం పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్య, వైద్యం, కమ్యూనిటీ హాలు వంటి వసతులను మురికివాడల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణమూర్తి, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, దళిత విముక్తి కన్వీనర్ ఎస్.వి.రమణ, విద్యా పరిరక్షణ కమిటీ సభ్యుడు కిశోర్, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు డి.ధర్మేందర్‌రెడ్డి, నటరాజ్, నగరం నలుమూలల నుంచి 700 మంది వరకు ప్రతినిధులు పాల్గొన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు పాటలతో ఉత్తేజం నింపారు. సమావేశం అనంతరం మేయర్ జి.హరివెంకటకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు.



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంఎన్ఎస్ఎస్ సభ్యులు

# విద్యాభివృద్ధిలో భాగస్వామ్యం అవసరం



డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డీఈవో చంద్రకళ. సంఘం నాయకులు

విశాఖ విద్య: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాలు భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సరపు క్యాలెండర్లు, డైరీలను మంగళవారం తన చాంబర్‌లో ఫెడరేషన్ నాయకులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాదిరెడ్డి గంగాధర్, జిల్లా ముఖ్యగౌరవ సలహాదారు జగన్నాథరావు, కోశాధికారి సంధ్యారాణి, గోవింద, నాగేశ్వరావు పాల్గొన్నారు.

# అప్పన్న సన్నిధిలో 'పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ'

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ ఎనర్జీ బృందం దర్శించుకుంది. కమిటీ చైర్‌పర్సన్ జగదాంబిక పాల్, సభ్యులు కిసాన్ కపూర్, సునీల్ కుమార్ మోండల్, కేఆర్ఎన్.రాజేష్ కుమార్ స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద వీరికి పూర్ణ కుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు. సూపరింటిండెంట్ పిళ్లా శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అప్పన్న ఆలయంలో కమిటీ చైర్‌పర్సన్ జగదాంబిక పాల్, సభ్యులు

# సుప్రీం తీర్పును ఆహ్వానిస్తున్నాం

అల్లిపురం : బిల్కిస్ బానో కేసులో సుప్రీం తీర్పును ఆహ్వానిస్తున్నామని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ అన్నారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బిల్కిస్ బానో నిందితుల విడుదలను ఛాలెంజ్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు కాగా విచారణ చేపట్టిన కోర్టు ముద్దాయిలందరినీ లొంగిపోవాలని ఆదేశించిందన్నారు. ఈ తీర్పు గుజరాత్ ప్రభుత్వానికి గుణపాఠంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో హెచ్ఆర్ అనూరాధ, ముస్లిం థింకర్స్ ఫోరం ప్రతినిధి జహీరా, నాస్తిక సమాజం ప్రతినిధి రాంప్రభు పాల్గొన్నారు.

# 14న సింహగిరిపై గోదా కల్యాణం

- 16న గజేంద్రమోక్షం
- ఈ నెల 11 నుంచి 17 వరకు ఆర్జిత సేవల రద్దు
- దర్శనాల వేళల్లో మార్పులు



సింహాచలం: భోగి పర్వదినం పురస్కరించుకుని ఈ నెల 14న సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో గోదా కల్యాణాన్ని విశేషంగా నిర్వహిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి కల్యాణోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం జరిగే నిత్యకల్యాణం కూడా గోదా కల్యాణంతో కలిపి నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తులంతా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15న మకర సంక్రాంతి పురస్కరించుకుని ఉత్తరాయణం పుణ్యకాలం పూజలు సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు దర్శనాలు ఉండవన్నారు. 16న కనుమ పురస్కరించుకుని కొండదిగువ పూలతోటలో గజేంద్రమోక్షం ఉత్సవం ఉంటుందన్నారు. ఆ రోజు సింహగిరిపై సాయంత్రం 4 గంటలకి స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని కొండ దిగువకి తీసుకెళ్తామన్నారు. గజేంద్రమోక్షం ఉత్సవం అనంతరం రాత్రి అడవివరం పుర వీధుల్లో స్వామిని గజవాహనంపై తిరువీధి నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున ఈ ఉత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ ఉత్సవం సందర్భంగా 16న సాయంత్రం 6 గంటల తర్వాత సింహగిరిపై స్వామి దర్శనాలు లభించవన్నారు. తిరిగి 17న ఉదయం 6.30 గంటల నుంచి యథావిధిగా దర్శనాలు ఉంటాయన్నారు. ఈ నెల 11 నుంచి 17 వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు వెల్లడించారు. అలాగే సాయంత్రం 7 గంటల తర్వాత దర్శనాలు లభించవన్నారు. ఈ నెల 12న కూడారై ఉత్సవం సందర్భంగా ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు దర్శనాలు లభించవని వివరించారు. భక్తులంతా ఈ విషయాలని గమనించాలని ఈవో కోరారు.

# సాయం చేస్తానంటూ మోసం

**ఏటీఎం నుంచి రూ.1.02 లక్షల నగదు విత్‌డ్రా**

కూర్మన్నపాలెం: సాయం చేస్తానని చెప్పి ఓ వృద్ధుడి వద్ద నుంచి ఏటీఎం కార్డు తస్కరించి, నగదు విత్‌డ్రా చేసిన గుర్తు తెలియని వ్యక్తిపై దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన గూడూరు స్వామిబాబు (71) ఈ నెల 5వ తేదీన స్థానిక ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌కు నగదు కోసం వెళ్లారు.

ఏటీఎంలో కార్డు పెట్టి నగదు విత్‌డ్రా చేస్తున్నా రాకపోవడంతో వెనుక ఉన్న గుర్తు తెలియని వ్యక్తి నగదు డ్రా చేసి ఇస్తానని చెప్పి, కార్డు తీసుకుని రెండు వేల రూపాయలు నగదు విత్‌డ్రా చేసి స్వామిబాబుకు ఇచ్చి, ఒరిజినల్ ఏటీఎం కార్డు స్థానంలో డూప్లికేట్ కార్డు ఇచ్చి వృద్ధుడిని పంపించి వేశాడు. అనంతరం ఒరిజినల్ ఏటీఎం కార్డును 11 సార్లు ఉపయోగించి ఒక లక్షా రెండు వేల రూపాయల నగదు విత్‌డ్రా చేశారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు స్వామిబాబు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.